సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 4 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

దేహ దారుఢ్యానికి ప్రాధాన్యత



పోలీస్ సిబ్బంది పరేడ్ పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక, ట్రైనీ ఐఏఎస్ రాఘువేంద్రమీనా

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు దేహ దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శారీరక శ్రమతోనే ఆరోగ్యం సాధ్యమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీసులు శుక్రవారం ప్రత్యేక పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసుల వ్యక్తిగత ప్రదర్శన, సమష్టి ప్రదర్శన పరిశీలించారు. జిల్లా డాగ్ స్క్వాడ్ పనితీరు, హ్యాండర్ల నైపుణ్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు మానసికంగా, శారీరకంగా చురుగ్గా ఉండాలని చెప్పారు. వ్యాయామం చేయాలని, నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వృత్తి పరంగా ఒత్తిడి లేకుండా ముందుకు సాగాలని చెప్పారు. పోలీసులు రోడ్డు భద్రత నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. గ్రీవెన్స్‌లో వృత్తిపరమైన, వ్యక్తిగత మైన అంశాలను తమ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ ఐఏఎస్ అధికారి రాఘువేంద్ర మీనా పోలీసుల విధుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు జీవీ ప్రసాదరావు, ఎస్.వాసుదేవ్, డి.ప్రసాదరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీసెట్–2023 రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం, అఫిలియేషన్ కళాశాలల్లో ఖాళీ సీట్లకు, గతంలో సీట్లు వచ్చి కళాశాల మార్పు కోరుకునే విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని అన్నారు. ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు రిజిస్ట్రేషన్, ఏడు నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. సీట్ల అలాట్‌మెంట్ 18వ తేదీన ఉంటుందని చెప్పారు. 20 నుంచి 23 మధ్య సీట్లు వచ్చిన విద్యా సంస్థల్లో విద్యార్థులు చేరాల్సి ఉంటుందని అన్నారు. మొదటి విడతలో అనుకున్న సంస్థల్లో సీట్లు రాని విద్యార్థులు, సీట్లు అలాట్ కాని విద్యార్థులు ఈ కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వర్సిటీలో 16 కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

కళాకారులకు కలెక్టర్ అభినందనలు



కళాకారులను సత్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమ ప్రతిభను గుర్తించి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు యడ్ల గోపాలరావు, తప్పెటగుళ్ల కళాకారుడు కోన సన్యాసిరావు కృతజ్ఞతలు తెలిపారు. వీరిద్దరినీ కలెక్టర్ శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌లో సత్కరించి అభినందించారు. కోన సన్యాసి తప్పెటగుళ్ల కళాకారులకు శిక్షణ ఇచ్చి పల్లె నుంచి ఢిల్లీ వరకు వెళ్లారని అన్నారు. అందుకే ఆయనకు ప్రభుత్వం వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాలమాన్ సింగ్, ప్రముఖ వక్త విశ్రాంతి అధికారి జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

సజావుగా సీస్ పరీక్షలు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) పరీక్షలు శుక్రవారం సజావుగా పూర్తయ్యాయని డీఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న సీస్ సర్వే పరీక్షల తీరును ఆయన మండల ఎంఈఓ దాలినాయుడుతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 1,223 పాఠశాలల్లో నిర్వహించినట్లు తెలిపారు. 31,167 మంది విద్యార్థులు పరీక్షలకు ఎంపిక చేయగా 95 శాతం మేరకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షల ఓఎంఆర్ షీట్లు మండల స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్‌లు, ఎంఈఓల ద్వారా శ్రీకాకుళం తరలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీటిని స్కాన్ చేసి కమిషనర్‌కు పంపనున్నట్లు వివరించారు. డ్రాపౌట్స్ కోసం ఓపెన్ స్కూల్స్ ప్రారంభించామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పతాక స్థాయికి ▶ మన పథకాల కీర్తి

- అంతర్జాతీయ సదస్సులో జిల్లా నీటి ప్రాజెక్టుల ప్రస్తావన
- పరిశీలనకు వచ్చిన ఉన్నతాధికారుల బృందం
- స్థానిక అధికారులకు కీలక సలహాలు
- సీఎం వైఎస్ జగన్ నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచన

హిరమండలం: జిల్లాలోని సాగు,తాగునీటి పథకాలకు పతాక స్థాయి ప్రచారం, గౌరవం లభించింది. సాగునీటికి సంబంధించి వంశధార ఫేజ్–2, గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకం నిర్మించి నీటిని మళ్లించడం, వంశధార–నాగావళి నదుల అనుసంధానం, తాగునీటికి సంబంధించి ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం పనులను ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేస్తోంది. వీటిని ప్రాధాన్యత ప్రాజెక్టులుగా పరిగణిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. విశాఖలో 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కమిటీ సమావేశాల ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్ వీటి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి సైతం 1300 మంది హాజరయ్యారు. దీంతో శ్రీకాకుళంలో జరుగుతున్న సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అక్కడ ప్రాధాన్యతాంశంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఉన్నతాధికారులు, నిపుణులు హిరమండలంలోని వంశధార ఫేజ్–2 రిజర్వాయర్, గొట్టా బ్యారేజీ సమీపంలో ఎత్తిపోతల పథకం ప్రతిపాదిత స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు కీలక సలహాలు, సూచనలు ఇచ్చారు. సీఎం లక్ష్యానికి తగ్గట్టు పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.



వంశధార రిజర్వాయర్, ఎత్తిపోతల పథకానికి సంబంధించి వివరాలను ఇంజినీర్ల బృందానికి వివరిస్తున్న వంశధార ఎస్ఈ తిరుమలరావు



ఉద్దానం మంచినీటి ప్రాజెక్టులో ఓ నిర్మాణం



● మార్చినాటికి ఎత్తిపోతల పథకం

వచ్చే ఖరీఫ్ నాటికి ఎత్తిపోతల పథకం ద్వారా వంశధార నీటిని ఫేజ్–2 రిజర్వాయర్‌లోకి మళ్లించనున్నట్టు వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమల రావు తెలిపారు. ప్రాజెక్టును సందర్శించిన ఉన్నతాధికారుల బృందానికి స్థానిక పరిస్థితులను తెలియజేశారు. ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా మార్చి నాటికి రెండు మోటార్లు అమర్చుతామని, జూన్ నాటికి మరో రెండు మోటార్లు అమర్చుతామని చెప్పారు. రిజర్వాయర్‌లోకి 12 టీఎంసీల నీటిని తరలిస్తామని చెప్పారు. గొట్టా బ్యారేజీ కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటి ఇబ్బంది తలెత్తకుండా కేవలం వరదలు వచ్చే సమయంలోనే ఎత్తిపోతల పథకం ద్వారా నీటి తరలింపు ఉంటుందన్నారు. అటు సైడ్ వీయర్ ద్వారా సైతం రిజర్వాయర్‌లో నీటిని నింపుతామని చెప్పారు. సముద్రంలోకి నదీ జలాలు వృథాగా పోకుండా ఉండేందుకే ఎత్తిపోతల పథకాన్ని నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో ఎత్తిపోతల పథకంతో పాటు ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అందుకే ప్రాధాన్యత ప్రాజెక్టులుగా పరిగణించి పనులు పూర్తిచేయాలని సీఎం ఆదేశించినట్టు ఎస్ఈ తిరుమలరావు గుర్తుచేశారు. ప్రాజెక్టులను పరిశీలించిన బృందంలో పోలవరం సీఈ సుధాకర్‌బాబు, కడప క్వాలిటీ కంట్రోల్ సీఈ శ్రావణ్‌కుమార్ రెడ్డి, అనంతపురం సీఈ శ్రీనివాసరెడ్డి, అనంతపురం ఎస్ఈ శివకుమార్‌రెడ్డి, ఈఈ కేదారేశ్వరరెడ్డి, వంశధార ఎస్ఈ డోల తిరులమలరావు వంశధార ఇంజినీర్ అధికారులు ఉన్నారు.



ఒంటరి జంటకు ఓదార్పు



కరణాలపేట గ్రామానికి కాలినడకన వెళ్తున్న ధర్మాన కృష్ణచైతన్య



ఒంటరి జంటకు అండగా ఉంటామని హామీ ఇస్తున్న నాయకులు

పోలాకి: 'ఒంటరి ఊరు..ఆ జంటే తోడు' అనే శీర్షికతో గత నెల 31వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైఎస్సార్ సీపీ నాయకులు స్పందించారు. మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచనల మేరకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య శుక్రవారం కరణాలపేటకు కాలినడకన చేరుకున్నారు. దీంతో రాజమహంతి జగదీశ్వరరావు, శార్వాణి దంపతులు ఎదురెళ్లి 'మా గ్రామానికి వచ్చిన మొదటి నాయకుడివి నీవే' అంటూ స్వాగతం పలికారు. తమ గ్రామ పరిస్థితిని, ఇక్కడ వారు మాత్రమే ఉండటానికి గల కారణాలను కృష్ణచైతన్యకు వివరించారు. కనీసం రహదారి సౌకర్యం కల్పించినా అత్యవసర వేళల్లో ఉపయోగపడుతుందని కోరారు. ఎంతకాలంగానో ఎన్నో వినతులు అందించామని, గత ప్రభుత్వంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ముందురోజు శిలాఫలకం పెట్టి అప్పటి నాయకులు చేతులు దులుపుకున్నారని శిష్టకరణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సదాశివుని కృష్ణ తెలిపారు. దీనిపై స్పందించిన కృష్ణచైతన్య నెలరోజుల్లో గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించటంతోపాటు అవకాశాలను పరిశీలించి డీఎల్‌పురం సచివాలయ పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలను కరణాలపేట గ్రామంలో ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తద్వారా ఒంటరి గ్రామానికి తోడుగా జగనన్న కాలనీ ఉంటుందని చెప్పారు. అప్పుడు రహదారి మాత్రమే కాకుండా మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వమే యుద్ధ ప్రాతిపదికన చేపడుతుందని అన్నారు. కృష్ణచైతన్య ప్రకటన విన్న వెంటనే ఆనందం వ్యక్తం చేసిన రాజమహంతి జగదీశ్వరరావు దంపతులు జగనన్నలేఅవుట్ కు స్థలాన్ని వితరణగా ఇచ్చేందుకు ముందుకువచ్చారు. కృష్ణచైతన్య వెంట మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, యువజన విభాగం నాయకులు చింతు రాఘవరావు, భీమారావు, బాలకృష్ణ, కణితి సత్తిబాబు, కన్నేపల్లి లక్ష్మణరావు ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్...

చిన్నారుల వైద్యానికి రూ.లక్ష సాయం

ఇచ్ఛాపురం రూరల్: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు శివంగి హర్షవర్ధన్, హర్షితల శస్త్ర చికిత్సకు సాయం అందించాలంటూ సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'చిన్ని ప్రాణాలకు ఆపద' కథనానికి కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి సభ్యులు స్పందించారు. కేశుపురం గ్రామానికి వెళ్లి చిన్నారుల వైద్యానికి కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.లక్ష నగదు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ 'సాక్షి' కథనం ద్వారా చిన్నారుల వ్యాధి తీవ్రతను తెలుసుకున్నామని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.



చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం చేస్తున్న కాళీమాత సేవా సమితి సభ్యులు

13 నుంచి మల్లన్న సన్నిధిలో కార్తీక మాసోత్సవాలు

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవాలయంలో ఈ నెల 13 నుంచి కార్తీక మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి జి.ప్రసాద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న కార్తీకమాసం మొదటి సోమవారం, 27న రెండో సోమవారం, డిసెంబర్ 4న మూడో సోమవారం, 11 న నాల్గో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే శీర్షాభిషేకం రూ.40, ప్రత్యేక దర్శనం రూ.20, కేశ ఖండన రూ.40, రుద్రాభిషేకం రూ. 50 చొప్పున టికెట్ ధరలు నిర్ధారించినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సెల్ నంబర్ 8555822569 సంప్రదించాలని ప్రసాద్‌బాబు కోరారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ముఖ్య అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం ఉదయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 2357 పోలింగ్ స్టేషన్లను గుర్తించామని, సాయుధ భద్రత దళాలు మినహా 11,313 మంది పోలింగ్ ఆఫీసర్లతో కలిపి 17,542 మంది సిబ్బంది, పోలీసు వాహనాల మినహా 600 వరకూ వివిధ రకాల వాహనాలు అవసరమని గుర్తించామని పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది కోసం 9 శిక్షణ కేంద్రాలు, ఎన్నికల సామ గ్రి పంపిణీ కోసం 8 డిస్పాచ్ కేంద్రాలు, తిరిగి వాటిని స్వీకరించేందుకు 8 కేంద్రాలు, 16 స్ట్రాంగ్ రూమ్‌లు, 17 కౌంటింగ్ సెంటర్లను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కోసం 1300 మందిని నియమించనున్నట్లు ఎస్పీ రాధిక పేర్కొన్నారు. మొబైల్ సిగ్నల్స్ లేని 13 (పాతపట్నం 12, పలాస 1) పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, రానున్న రెండు మూడు నెలల్లో అక్కడ కొత్తగా సెల్ ఫోన్ టవర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న 15 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వివరించారు. వచ్చే డిసెంబర్ నెలాఖరుకు పోలింగ్ సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ 2019లో ఎన్నికల సందర్భంగా 672 ఎఫ్ఐఆర్ లు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వర కూ రూ.53 లక్షలు విలువైన మద్యం సీజ్ చేశామని, 437 కిలోల గంజాయిని పట్టుకుని కేసులు నమోదు చేశామని వివరించారు. రానున్న ఎన్నికల దష్ట్యా ఇప్పటినుంచే పటిష్టమైన, కట్టుదిట్టమైన నిఘాను పెట్టనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతి రావు, అదనపు ఎస్పీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పలాసలో ఏసీబీ అధికారుల తనిఖీలు



టౌన్‌ప్లానింగ్ విభాగంలో వివరాలు సేకరిస్తున్న ఏసీబీ అధికారులు

- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయంలో తనిఖీలు
- మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, సచివాలయ టౌన్‌ప్లానింగ్‌పై ఆరా

కాశీబుగ్గ: ఏసీబీ అధికారుల తనిఖీలతో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో అలజడి రేగింది. ఉదయం పదకొండు గంటలకు ఆల్ ఇండియా పర్మిట్‌తో ఉన్న రెండు కార్లు మున్సిపల్ కార్యాలయానికి వచ్చాయి. అందులో నుంచి దిగిన అధికారులు ఒక్కసారిగా టౌన్‌ప్లానింగ్ విభాగంలోకి ప్రవేశించి అందరి సెల్‌ఫోన్లు తీసుకుని ఎక్కడి వారు అక్కడే కూర్చోవాలని ఆదేశించారు. దీంతో కంప్యూటర్లు, టేబుల్ వద్ద ఉన్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఒక్కసారిగా అవాక్కయ్యారు. మున్సిపాలిటీలోని వార్డు ప్లానింగ్ కా ర్యదర్శులను పిలిపించారు. స్థానికంగా ఉన్న కొన్ని భవనాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించా రు. ముగ్గురు సీఐలు మూడు బృందాలుగా విడిపోయి భవనాల పరిశీలనకు ఓ బృందం, ఆ భవనాల రికార్డులు మరికొందరు సేకరించారు. ఏసీబీ డీఎస్పీ రాకపోవడంతో వివరాలు వెల్లడించడానికి అధికారులు విముఖత చూపించారు. సీఐలు ఏవీ రమణ, భాస్కరరావు, హరి తదితరులు తనిఖీలు నిర్వహించారు.

గృహ నిర్మాణాలపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పూర్తి చేసిన గృహాల్లో విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహ నిర్మాణాలు ప్రారంభించకపోతే వాటిని రద్దు చేసి వేరే అర్హులకు అందించాలని సూచించారు. అక్టోబర్ తర్వాత సాధించిన పురోగతిపై మండలాల వారీగా ఆయన అడిగి తెలుసుకున్నారు. నెలలో కనీసం రెండు సార్లు కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీల్లో నివాసానికి యోగ్యంగా ఉన్న గృహాలకు జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించాలన్నారు. మండల స్థాయిలో ప్రతీ లే ఔట్‌లో నిర్మిస్తున్న కాలనీలకు ఈపీడీసీఎల్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సంయుక్తంగా పరిశీలించి అక్కడ ఆయా శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ రిపోర్టులు నవంబరు 13వ తేదీ నాటికి అందజేయాలన్నారు. పీఎంఏవైజీ లబ్ధిదారుల్లో ఎంత మందికి రుణాలు ఇచ్చారో డీఆర్‌డీఏ పీడీని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో హౌసింగ్ పథకంలో ఉన్న లబ్ధిదారులు మెప్మా గ్రూపులో సభ్యులు కాకపోతే వారిని స్వయం సహాయక సంఘాల గ్రూపులో చేర్పించాలని ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు ప్రారంభోత్సవంలో (గృహ నిర్మాణాల్లో) జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం వచ్చినందుకు ఈఈలు అప్పారావు, రామమూర్తిలకు అవార్డులు అందజేశారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ గణపతిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.



గృహనిర్మాణశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ


ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఫోన్‌ఇన్ లైవ్ కోసం 8247861919కి ఫోన్ చేయాలని తెలిపారు.

నేడు శ్రీముఖలింగం హుండీ ఆదాయం లెక్కింపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం శనివారం లెక్కించనున్నట్లు ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల భక్తులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొంటారని ఈఓ కోరారు.

5న మంత్రి బొత్స జిల్లా పర్యటన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ నెల 5వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకటన ప్రకారం.. 5వ తేదీ ఉదయం 11:30 గంటలకు మంత్రి విజయనగరం నుంచి టెక్కలికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మా ట్లాడుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు వజ్రపుకొత్తూరు మండలం బెండి గేటుకు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్న భోజన విరామ అనంతరం పలాసలోని కేకే రోడ్డునకు 3 గంటలకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 5.00 గంటలకు మంత్రి తిరిగి విజయనగరం వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు.





● గఘన విన్యాసం

నింగి కొత్త రంగులద్దుకుంది. నిశి వేళ గగన వేదికపైకి దూసుకువచ్చిన మబ్బులు ఓ అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాయి. సూర్యోదయ సమయానికి మంచు తెరల మధ్య వెండి మేఘాలు మెరిసిపోయి కనిపించాయి. ప్రకృతి విన్యాసాన్ని శ్రీకాకుళం నగర వాసులు ఆస్వాదించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం క్రైమ్

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌



ఆదిత్యుని జ్ఞాపికను సీవీఓ ప్రసన్నకుమార్‌కు అందజేస్తున్న ఈఓ, ప్రధానార్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తూర్పు ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ (సీవీఓ) ఏపీఎల్‌ ప్రసన్నకుమార్‌ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజలు చేయించారు. అనివేటి మండపంలో వేదాశీర్వచనం, ఆదిత్యుని జ్ఞాపికను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో విజిలెన్స్‌ సీఐలు వెంకునాయుడు, వెంకటనారాయణ, ఆలయ సూపరింటెండెంట్‌ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ శాఖలో ఫైళ్ల పరిశీలన

స్థానిక విద్యుత్‌ సర్కిల్‌ కార్యాలయంలో విజిలెన్స్‌ విభాగంలో పలు ఫైళ్లను విజిలెన్స్‌ చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ ప్రసన్నకుమార్‌ శుక్రవారం ఉదయం పరిశీలించారు. అక్రమ విద్యుత్‌ కేసుల విషయంలో లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

ఉత్తరాంధ్ర చిత్రకళా ప్రదర్శనకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్‌: కల్పన కల్చరల్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లా చిత్రకళ ప్రదర్శనకు చిత్రకారుల నుంచి చిత్రాలను ఆహ్వానిస్తున్నామని నిర్వాహకులు యార్లగడ్డ హేమంత్‌ కుమార్‌ ఓ ప్రకటనలో కోరారు. చిత్రాల కనిష్ఠ సైజు 18–26 అంగుళాలు, గరిష్ఠ సైజు 24–36 అంగుళాలు ఉండాలని అన్నారు. ఆయిల్‌, అక్రిలిక్‌, వాటర్‌ కలర్స్‌ చిత్రాలు మాత్రమే అనుమతిస్తామని, ఉత్తమ చిత్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నగదు, షీల్డ్‌, సర్టిఫికెట్‌ అందిస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 9, 10 తేదీల్లో పార్వతీపురంలోని లయన్స్‌ కల్యాణ మండపంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8179940599 నంబరుకు ఫోన్‌ చేసి తెలుసుకోవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్‌: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ క్రీడల్లో పాల్గొననున్న అండర్‌–19 క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్‌ గురుకుల పాఠశాల పీడీ ఎన్‌.రామన్న తెలిపారు. గురుకులంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. సైక్లింగ్‌ పోటీలు ఈ నెల 5న దుప్పలవలస గురుకులంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 5న సాఫ్ట్‌ టెన్నిస్‌ పోటీలు పాతపట్నం మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్‌ నంబర్‌ 6302546128ను సంప్రదించాలని చెప్పారు.

ఆయుర్వేద వైద్యానికి ఆయుష్షు



ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆయుర్వేద మందులు

- ఆయుర్వేదానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లాలో 14 ఆయుర్వేద డిస్పెన్సరీలు
- శ్రీకాకుళంలో ఆయుష్‌ హెల్త్‌ అండ్‌ వెల్‌నెస్‌ కేంద్రం



పరీక్షల అనంతరం యోగా చేయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్‌: భారతీయ సనాతన వైద్య రీతి ఆయుర్వేదానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇంగ్లిష్‌ మందులకు చాలా మంది అలవాటు పడిపోయినా.. ఆయుర్వేద మందులతో కూడా పలు రకాల అనారోగ్యాలను బాగు చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో 14 ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉన్నాయి. గతంలో ఈ డిస్పెన్సరీలకు ప్రాధాన్యత లేకుండా నిర్వహించేవారు. వైఎస్‌ జగన్‌ సీఎం అయ్యాక ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నూతనంగా మందులను సరఫరా చేస్తోంది.

ఉచిత సేవలు

జిల్లా వ్యాప్తంగా 14 చోట్ల ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉన్నాయి. ప్రైవేటుగా కూడా జిల్లా కేంద్రంలో చాలా ఆయుర్వేద కేంద్రాలు ఉన్నాయి. తాజాగా జిల్లా కేంద్రంలో ఉన్న డిస్పెన్సరీని అప్‌గ్రేడ్‌ చేసి ఆయుష్‌ హెల్త్‌ అండ్‌ వెల్‌నెస్‌ కేంద్రంగా చేశారు. ఇక్కడ యోగా కూడా నిర్వహిస్తున్నారు. ఆయుర్వేద మందుల కోసం వచ్చే వారికి చికిత్సతో పాటుగా యోగా చేయిస్తున్నారు.

రూ.11లక్షల మందులు సరఫరా

ప్రతి మూడు నెలలకు జిల్లాలోని ఆయుర్వేద డిస్పెన్సరీలకు సుమారుగా రూ.11లక్షల విలువైన మందులు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఏడాదికి రూ.50లక్షల విలువ గల మందులు అందజేస్తున్నారు. అవసరమైన చోట డిస్పెన్సరీల రిపేర్లు కూడా చేయిస్తున్నారు.

సైడ్‌ ఎఫెక్టులు ఉండవు

ఆయుర్వేద వైద్యంతో సులభంగా, శాశ్వతంగా అనేక విధాలైన దీర్ఘకాలిక వ్యాధులను, మానసిక వ్యాధులను నివారించవచ్చు. వైద్యంలో ఎలాంటి సైడ్‌ ఎఫెక్టులు గానీ, మందులు వికటించడం గానీ ఉండదు. శస్త్ర చికిత్స అవసరం లేకుండా శారీరక, మానసిక రుగ్మతలను, రోగాలను ఈ వైద్యం ద్వారా రూపుమాపవచ్చని ఎంతో మంది వైద్యులు నిరూపించారు. దీనికి తోడు ఆయుర్వేద మందులు వాడితే రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

ఆయుర్వేదంతో ఎన్నో రోగాలు మాయం



ఇంగ్లిష్‌ మందుల వల్ల నయం కాని రోగాలు ఆయుర్వేదంతో నయమవుతాయి. ముఖ్యంగా చర్మవ్యాధులు, కీళ్లవ్యాధులు కేవలం ఆయుర్వేదం ద్వారానే నయం అవుతాయి. ఇక్కడ పిస్టులా వ్యాధికి క్షారసూత్ర (థ్రెడ్డింగ్‌) ద్వారా వైద్యం అందిస్తున్నాం. మందుల వాడకం ఇటీవల కాలంలో బాగా పెరుగుతోంది. రోజుకు 30మందికి పైగా వస్తున్నారు. ఆయుష్‌ సహకారంతో ఉచితంగా మందులను పరీక్షలు జరిపి ఇస్తున్నాం. వెంటనే యోగా కూడా చేయిస్తున్నాం. మందుల వాడకంపై ఎంతోమంది అపోహ పడుతున్నారు. దీనికి ఎలాంటి పథ్యం పాటించక్కరలేదు. కేవలం వ్యాధికి సంబంధించిన పథ్యం మాత్రమే.

– డాక్టర్‌ పి. జగదీష్‌, ఆయుష్‌ హెల్త్‌ అండ్‌ వెల్‌నెస్‌ సీనియర్‌ వైద్యులు

సయాటికా సమస్య తీరింది



నేను రిటైర్‌ అయిన తర్వాత నాకు సయాటికా సమస్య వచ్చింది. సాధారణ మందుల వల్ల నయం కాలేదు. రెండు నెలలుగా క్రమం తప్పకుండా ఆయుర్వేద మందులు వాడుతున్నాను. బాగా గుణం కనిపించింది.

– బి.శ్రీరామమూర్తి, బలివాడ

సాధారణ సమస్యలు తగ్గాయి



జలుబు, జ్వరం వంటి సాధారణ రోగాల కోసం కూడా ఈ మందులు వాడుతున్నాను. బాగా తగ్గాయి. ఈ మందులు వాడుతున్న దగ్గర నుంచి హాయిగా ఉంది.

– భారతి, పొన్నాడ

పెద్దవారిలో కీళ్లనొప్పులు, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటివే కాకుండా మహిళల్లో వచ్చే వ్యాధులకు ఆయుర్వేదంతో పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

‘సీఎం వైఎస్‌ జగన్‌ అభివృద్ధి ప్రదాత’



రహదారి పనులకు శంకుస్థాపన చేసిన స్పీకర్‌ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్‌ జగన్‌ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని స్పీకర్‌ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. అలికాం–బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి జంక్షన్‌ నుంచి బొ్రంపేట వరకు రూ.2.75 కోట్ల ఎస్సార్పీ నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు స్పీకర్‌ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సుల్లో స్పీకర్‌ మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గంలో రూ.200 కోట్లతో రహదారులన్నీ త్వరలో పూర్తిచేస్తామని వెల్లడించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తోందని తెలిపారు. కల్లబొల్లి మాటలు చెప్పి గత పాలకుల మాదిరిగా కాలక్షేపం చేయడం తమ లక్షణం కాదని, అభివృద్ధిని ప్రజల కంటికి ప్రత్యక్షంగా చూపిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ ఎడ్ల ఈశ్వరరావు, సరుబుజ్జిలి సర్పంచ్‌ బొడ్డేపల్లి చాందిని వెంకటసూర్య, జిల్లా బీసీ సెల్‌ అధ్యక్షుడు మూడడ్ల రమణ, జేసీఎస్‌ కన్వీనర్‌ అత్తులూరి రవికాంత్‌, పార్టీ నేతలు బొడ్డేపల్లి హరి, చామంతి, ఇల్లాకుల సూర్యప్రకాశరావు, తిరుమల, రాజేష్‌, ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్‌, ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయనాయక్‌ పాల్గొన్నారు.

‘సైనికుల త్యాగాలు మరువలేనివి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌

నరసన్నపేట: దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని,వారి సేవలు దేశ ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ అన్నారు. మండలం మాకివలసకు చెందిన చల్లా రమేష్‌ ఆర్మీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రమేష్‌ సేవలను అభినందించారు.

కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, మాకివలస ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్‌ రావాడ మోహనరావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, బుడ్డల రాజశేఖరరావు, పాగోటి భరద్వాజ, చల్లా తాతారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో అవగాహన



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారులు

మందస: పెద్దపులి ఆనవాళ్ల కోసం అటవీ శాఖ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మందస–సోంపేట మండలాల సరిహద్దుల్లో పులి తిరుగుతున్నట్టు పాదముద్రలు కనిపించడంతో మందస మండలంలోని కొత్తపల్లి, ముకుందపురం, మూలిపాడు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న మహేంద్ర తనయ నదిలో అధికారులు పులి పాదముద్రలను శుక్రవారం గుర్తించారు. కాశీబుగ్గ రేంజ్‌ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యంలో ఫారెస్ట్‌ సెక్షన్‌ అధికారులు, ఫారెస్ట్‌బీట్‌ అధికారులు, అసిస్టెంట్‌ బీట్‌ అధికారులు ఆర్‌.రాఘవయ్య, వజ్రపుకొత్తూరు బీవీరెడ్డి, పి.రాజు, ఎస్‌.రాజేంద్ర ఎఫ్‌ఎస్‌బీ ఎం.పోలయ్య, టి.వెంకటేష్‌, ఎస్‌.దుర్గాదేవి, ఆర్‌.వెన్నెల, ఆర్‌.జోగారావు, ఎ.బాబురావు, ఎస్‌.రవి, ఆర్‌.సంతోష్‌కుమార్‌, కృష్ణారావు రెండు బృందాలుగా విడిపోయి పెద్దపులిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని మూలిపాడు, ముకుందపురం, కొత్తపల్లి, సిద్ధిగాంలతో పాటు పాత్రఖండ, కర్తలిపాలేం, పాలవలస తదితర గ్రామాల్లో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. పెద్దపుల్లి సంచారంపై పుకార్లను ప్రచారం చేయవద్దని కోరారు.

‘ఐటీఐ విద్యార్థుల్లో లైఫ్‌స్కిల్స్‌ కీలకం’



శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఐటీఐ విద్యార్థుల్లో లైఫ్‌ స్కిల్స్‌ అవసరమని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌ సుధాకర్‌ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్‌ హబ్‌లో లైఫ్‌ స్కిల్స్‌, స్పోకెన్‌ ఇంగ్లిష్‌ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగ కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందుకోసమే స్కిల్‌ హబ్‌లు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులకు ఉద్యోగాలు లభించాలంటే కమ్యూనికేషన్‌ స్కిల్‌, ఇంగ్లిష్‌ పరిజ్ఞానం, సాఫ్ట్‌స్కిల్స్‌, లైఫ్‌ స్కిల్స్‌ అవసరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు కామేశ్వరరావు, విద్యాసాగర్‌, రంజిత్‌ కుమార్‌ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నాటిక పోటీలు ప్రారంభం



మేము మనుషులమే నాటికలో దృశ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్ల బహూకరణ

శ్రీకాకుళం కల్చరల్‌: యువత నాటక రంగానికి రావాలని, అప్పుడే నాటక రంగం కొనసాగుతుందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఐఅండ్‌పీఆర్‌ ఆఫీసర్‌ కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ సమాఖ్య ఎన్నో కష్టనష్టాలతో విజయవంతంగా ఈ సంస్థను నడిపిస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు. విశ్రాంత ప్రొఫెసర్‌ డీఎస్‌ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే నాటిక పోటీల్లో సమాఖ్య కూడా పాల్గొనాలని కోరారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ఆన్‌లైన్‌లో నిర్వహించిన వేమన పద్యాలు, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రణీత్‌, ప్రేమ్‌కుమార్‌లకు నగదు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు.

ఈ సందర్భంగా రావి నాగేశ్వరరావు రచన, సంధ్యా ప్రియదర్శిని దర్శకత్వంలో జాస్మిన్‌ ఆర్ట్స్‌, విశాఖ వారి ‘మేము మనుషులమే’ నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. హిజ్రాల జీవితాల కథాంశంగా నాటిక నడిచింది. ఈ నాటికను డాక్టర్‌ సూర్యలింగం, లక్ష్మీనరసమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో ప్రదర్శించారు. ది అమెచ్యూర్స్‌ డ్రమిటిక్‌ అసోసియేషన్‌, చిలకలూరి పేట వారి ‘ఏడనున్నాడో–ఎక్కడున్నాడో’ నాటిక హాస్యభరితంగా సాగింది. ఎస్‌కె షఫీ దర్శకత్వం వహించారు. ఈ నాటికను పూర్ణా క్రియేషన్స్‌ ఫాజుల్‌ భాగ్‌ పేటకు చెందిన పన్నాల నర్సింహమూర్తి సోదరుల సౌజన్యంతో ప్రదర్శించారు.

రైలు ప్రమాద మృతులకు సైకత నివాళులు



విజయనగరం జిల్లా అలమండ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులకు గేదెల హరికృష్ణ సైకత నివాళులు అర్పించారు. గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద రైలు ప్రమాద మృతులకు కన్నీటి నివాళులు అర్పిస్తూ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు.

– ఆమదాలవలస రూరల్‌

ఆటో డ్రైవర్‌ గొంతు కోసి పరారీ



ఆటో డ్రైవర్‌ గొంతుకోసి పరారయిన అనుమానితుని సీసీ టీవీ ఫుటేజీ



ఆటో డ్రైవర్‌ గోవిందరావు నుంచి ఘటన వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ

నందిగాం: మండలంలోని దిమ్మడిజోల కల్లాడ మధ్య రహదారిపై గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని ప్రయాణికుడు ఆటో డ్రైవర్‌ గొంతు కోసి పరారయ్యాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస శ్రీనివాసనగర్‌కు చెందిన గేదెల గోవిందరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. పలాస రైల్వేస్టేషన్‌ నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని గమ్యస్థానాలకు చేరుస్తుంటారు. రోజులాగే గురువారం రాత్రి 10.30 గంటలకు విశాఖ నుంచి పలాస వచ్చే ప్యాసింజర్‌ రైలు నుంచి వచ్చే వారి కోసం వేచి ఉన్నాడు. ఆ ట్రైన్‌లో దిగిన ఓ వ్యక్తి గోవిందరావు వద్దకు వచ్చి నందిగాం మండలం కాపుతెంబూరు తీసుకువెళ్లాలని, చార్జీ రూ.500కు మాట్లాడుకున్నారు. అయితే పలాస నుంచి బెండిగేటు వద్దకు ఆటో వచ్చే సరికి కాపుతెంబూరు కాదు దిమ్మడిజోల తీసుకువెళ్లాలని గోవిందరావుకు చెప్పాడు. అయితే దిమ్మడిజోల దూరం కాబట్టి రూ.500కు రాలేను అంటే అదనంగా డబ్బులు ఇస్తానని చెప్పడంతో మెళియాపుట్టి మార్గంలో దిమ్మడిజోల గ్రామ చివరకు చేరారు. అక్కడకు వెళ్లాక కల్లాడ మీదుగా నేరేడుకోట వెళ్లాలని చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆ ఊరిలో మా అక్క ఉంది డబ్బులు ఇస్తానని చెప్పడంతో కల్లాడ వైపు వెళ్తుండగా మార్గం మధ్యలో ప్రయాణికుడు తన వద్ద కత్తితో ఆటోడ్రైవర్‌ గొంతు కోసి పరారయ్యాడు. ఆ దారిలో పొలాలకు నీరు పెట్టేందుకు వచ్చిన కొందరు రైతులు ఆపి రాత్రి ఎక్కడకు వెళ్తున్నావని ప్రశ్నిస్తే.. ఆటో డ్రైవర్‌ మధ్యలో దింపేశాడని చెప్పి పరారయ్యాడు. ఇంతలోగా ఆటో డ్రైవర్‌ కేకలు వేయడంతో రైతులు అతని పరిస్థితి చూసి సపర్యలు చేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం రాగోలు జెమ్స్‌కు తరలించారు.

గాయపడిన ఆటో డ్రైవర్‌ గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్‌అమీర్‌ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నందిగాం మండలంలో ఈ ఘటన ఒక్కసారిగా సంచలనం రేపింది. దీంతో నందిగాం పోలీసులు రైల్వే స్టేషన్‌ సీసీ టీవీ ఫుటేజీలో అనుమానితుని గుర్తించి కల్లాడ పరిసర గ్రామాల్లో వెతుకుతున్నారు.

పలు కేసుల్లో ఆరుగురు అరెస్టు

టెక్కలి రూరల్‌: మండలంలో పలు కేసులకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ ఏడాది జూలై నెలలో నమోదైన గంజాయి కేసుకు సంబంధించి మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ ఎల్‌.రామకృష్ణ తెలిపారు. జూన్‌ నెలలో అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయితో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసుకే సంబంధించి టెక్కలికి చెందిన దాసరి మౌళీ, రఘు బెహరా అనే మరో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొట్లాట కేసులో ముగ్గురు అరెస్టు

మండలంలోని దీపావళి, పెద్దరోకళ్ల పల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య కొట్లాటకు సంబంధించి ఆగస్టు నెలలో మెండబోయిన దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తామరపల్లి రమణయ్య, కిషోర్‌, కళావతి అనే ముగ్గురిని అరెస్టు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. అలాగే జూన్‌ నెలలో మండలంలోని పెద్దసాన గ్రామంలో గల దేవాలయం వద్ద పడుకుని ఉన్న వ్యక్తిపై జరిగిన దాడి కేసులో బడగల మనోజ్‌ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘స్వచ్ఛందంగా సేవ చేయండి’

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: పారాలీగల్‌ వలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్‌ అహ్మద్‌ మౌలానా అన్నారు. పారా లీగల్‌ వలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి అభ్యర్థుల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా వలంటీర్లు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కోర్టు గౌరవ ప్రతిష్ఠలు కాపాడేలా ప్రవర్తించాలన్నారు.

‘పరీక్ష ఫీజులు చెల్లించాలి’

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అన్ని జూనియర్‌ కళాశాలల్లో పరీక్ష ఫీజులను వంద శాతం మంది చెల్లించేలా చూడాలని ఇంటర్మీడియెట్‌ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు తెలిపారు. శ్రీకాకుళంలోని శ్రీ కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జిల్లా ఆర్‌ఐఓ పి.దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాచ్‌లవారీగా ప్రాక్టికల్స్‌ నిర్వహించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు.

6న అంతర వర్సిటీ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విశ్వవిద్యాలయంలో ఈ నెల 6న అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే కబడ్డీ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు వర్సిటీ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎంపికలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థులు ప్రిన్సిపాల్‌ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.